సాక్షి
ప్రకాశం

బుధవారం । 1 । మార్చి । 2023



ఎమ్మెల్సీ ఎన్నికలకు పక్కా ఏర్పాట్లు చేయండి

ఎమ్మెల్సీ ఎన్నికలకు పక్కా ఏర్పాట్లు చేయాలని రిటర్నింగ్ అధికారి ఆదేశించారు. - 8లో..



కట్టుకున్నోడే కాలయముడు

అనుమానంతో భార్యను హత్య చేసిన భర్త రోడ్డు ప్రమాదంలో చనిపోయినట్లుగా చిత్రీకరించినట్లు పోలీసుల విచారణలో తేలింది. - 8లో..

గరిష్టం/కనిష్టం
32 /20

వాతావరణం

ఆకాశం నిర్మలంగా ఉంటుంది. రాత్రి చల్లని గాలులు వీస్తాయి. వాతావరణంలో తేమ శాతం అధికం.

న్యూస్‌రీల్

గాయపడిన ఫారెస్ట్ వాచర్‌కు నష్టపరిహారం



ఫారెస్ట్ వాచర్‌కు నష్టపరిహారం చెక్కును అందజేస్తున్న ఆ శాఖాధికారులు

యర్రగొండపాలెం: ఎలుగుబంటి దాడిలో గాయపడిన ఫారెస్ట్ ప్రొటెక్షన్ వాచర్ దంసాని బసవయ్యకు మంగళవారం అటవీ శాఖ అధికారులు రూ.75 వేలు నష్టపరిహారాన్ని అందజేశారు. గత నెల 13వ తేదీన దద్దనాల అటవీ ప్రాంతంలో బసవయ్య విధులు నిర్వర్తిస్తున్న సమయంలో పిల్లలతో ఉన్న ఎలుగుబంటి అతనిపై దాడి చేసి గాయపరిచింది. ఈ నేపథ్యంలో అతనికి నష్టపరిహారం అందజేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో గంజివారిపల్లె రేంజర్ ఎస్.వి.సుబ్బారావు, సర్పంచ్ డి.సుబ్బారెడ్డి పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికలు సమర్థవంతంగా నిర్వహించాలి

- ఎన్నికల ఏర్పాట్లను పరిశీలించిన కలెక్టర్, ఎస్పీ



బ్యాలెట్ బాక్సులను పరిశీలిస్తున్న బాపట్ల కలెక్టర్, ఎస్పీలు

చీరాల: ఉపాధ్యాయ, పట్టభద్రుల శాసనమండలి ఎన్నికలను జిల్లాలో సమర్థవంతంగా నిర్వహించాలని బాపట్ల జిల్లా కలెక్టర్ కే విజయకృష్ణన్ అన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో పట్టణంలోని ఎన్‌ఆర్‌పీఎం హైస్కూల్‌లో ఎన్నికల ఏర్పాట్లను మంగళవారం ఆమె ఎస్పీ వకుల్ జిందాల్, జాయింట్ కలెక్టర్ కే.శ్రీనివాసులతో కలిసి పరిశీలించారు. ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు నిర్వహించాలన్నారు. ఓటర్లకు ఎలాంటి అసౌకర్యం లేకుండా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. పోలింగ్ బూత్‌ల వద్ద దివ్యాంగుల కోసం ర్యాంప్ విధిగా ఏర్పాటు చేయాలని, మరుగుదొడ్లు, విద్యుత్, ఫ్యాన్లు వంటివి ఏర్పాటు చేయాలన్నారు. తాగునీటి సౌకర్యాన్ని ప్రతి కేంద్రం వద్ద కల్పించాలని సూచించారు. ఎన్నికలకు సంబంధించిన బ్యాలెట్ బాక్సులను ప్రతిష్ట భద్రతల మధ్య స్ట్రాంగ్ రూమ్‌లో ఉంచాలన్నారు. మున్సిపల్ హైస్కూల్ పైఅంతస్తులోని రెండు గదుల్లో స్ట్రాంగ్ రూమ్‌లను ఏర్పాటు చేయాలని, తక్షణమే పోలీసు బందోబస్తు ఉంచాలన్నారు. ఎన్నికల సామగ్రి పంపిణీ, రిసెప్షన్ కౌంటర్లను వారు పరిశీలించారు. ఎన్నికల సామగ్రి తరలించే రూట్‌మ్యాప్ వివరాలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో కలెక్టర్ వెంట చీరాల, బాపట్ల ఆర్డీవోలు పి.సరోజిని, జి.రవిందర్, మండల తహసీల్దార్ ప్రభాకర్, మున్సిపల్ కమిషనర్ ఐసయ్య తదితరులు ఉన్నారు.

నీటిని సక్రమంగా అందించాలి

- సీఈ మురళీనాథ్‌రెడ్డి




రాళ్లపాడు ప్రాజెక్టును పరిశీలిస్తున్న సీఈ మురళీనాథ్‌రెడ్డి

లింగసముద్రం: రాళ్లపాడు ప్రాజెక్టులో ఉన్న నీటిని సాగు, తాగునీటికి సక్రమంగా అందించాలని సీఈ మురళీనాథ్‌రెడ్డి అన్నారు. ఎస్ఈ లక్ష్మీరెడ్డితో కలిసి ప్రాజెక్టును, పాత స్పిల్‌వే, కొత్త స్పిల్‌వే గేట్లను మంగళవారం పరిశీలించారు. ప్రాజెక్టులో నీటి సామర్థ్యం గురించి, కుడి, ఎడమ కాలువలకు ఎన్ని క్యూసెక్కులు విడుదల అవుతుందని డీఈలు లక్ష్మీనారాయణ, హజరత్తయ్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రాజెక్టులో ఇంటెక్‌వెల్ ద్వారా మూడు భారీ మంచి నీటి పథకాల నుంచి లింగసముద్రం, వలేటివారిపాలెం, గుడ్లూరు, ఉలవపాడు మండలాల్లోని 114 గ్రామాలకు మంచి నీటిని అందిస్తున్నట్లు చెప్పారు. ఆయన వెంట జేఈలు చంద్రమౌళి, పూర్ణచంద్రరావు ఉన్నారు.

చిగురిస్తున్న ఆశలు

పశ్చిమ ప్రకాశం వాసుల కల నెరవేరే దిశగా అడుగులు వేగంగా పడుతున్నాయి.
ఈ ప్రాంత ప్రజలకు అధునాతన వైద్యసేవలు అందుబాటులోకి తీసుకురావాలన్న లక్ష్యంతో చేపట్టిన మెడికల్ కళాశాల, ఆస్పత్రి నిర్మాణ పనులు జోరందుకున్నాయి. ఇక్కడ నర్సింగ్ కళాశాలతో పాటు, కిడ్నీ రీసెర్చ్ సెంటర్ కూడా అందుబాటులోకి రానున్నాయి.

- రూ.430 కోట్లతో మెడికల్ కళాశాల, సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి
- వడివడిగా నిర్మాణ పనులు
- పేదలకు అందుబాటులోకి రానున్న అధునాతన వైద్యసేవలు
- 500 పడకల ఏర్పాటు
- కిడ్నీ బాధితుల కోసం రీసెర్చ్ సెంటర్



వేగంగా సాగుతున్న మెడికల్ కాలేజీ నిర్మాణ పనులు

మార్కాపురం: మెరుగైన వైద్యసేవల కోసం సుదూర ప్రాంతాలకు వెళ్లాల్సిన అవసరం లేకుండా పశ్చిమ ప్రకాశం ప్రాంతాలైన మార్కాపురం, గిద్దలూరు, యర్రగొండపాలెం, కనిగిరి నియోజకవర్గ ప్రజలకు సూపర్ స్పెషాలిటీ వైద్యసేవలు అందించేందుకు వైద్య కళాశాలతో పాటు ఆస్పత్రిని ఏర్పాటు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. మార్కాపురం మండలం రాయవరం వద్ద సుమారు 41.97 ఎకరాల విస్తీర్ణంలో రూ.475 కోట్ల వ్యయంతో చేపట్టిన నిర్మాణ పనులు వేగంగా జరుగుతున్నాయి. తొలుత ఆస్పత్రి నిర్మాణాన్ని చేపట్టారు. దాదాపు 2 నెలల నుంచి పనులు నిర్విరామంగా సాగుతున్నాయి. పునాది పనులు పూర్తికానున్నాయి. కూలీలు అక్కడే ఉండి పనులు చేసేందుకు వీలుగా షెడ్ల నిర్మాణాన్ని సైతం ప్రారంభించారు. ప్రభుత్వం గత ఏడాది మార్చి 22న జీఓ ఎంఎస్ నంబర్ 33ను విడుదల చేసింది. అగ్రిమెంట్ అయిన 30 నెలల్లోపు కాలేజీ నిర్మాణం పూర్తి చేయాలని పేర్కొంది. మొత్తం 13.43 లక్షల స్క్వేర్ మీటర్ల విస్తీర్ణంలో నిర్మించనున్నారు. మెడికల్ కాలేజీ కోసం ఎమ్మెల్యే నాగార్జునరెడ్డి చేసిన కృషి ఫలించబోతోంది. నిధుల కేటాయింపుపై పలు దఫాలుగా ఎమ్మెల్యే సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని కలిశారు. దీనికి ఆయన సానుకూలంగా స్పందించారు. దీనితో 100 సీట్లతో మెడికల్ కళాశాల, నర్సింగ్ కాలేజీ, కిడ్నీ రీసెర్చ్ సెంటర్ ఏర్పాటు చేయనున్నారు. అలాగే సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిని కూడా నిర్మిస్తున్నారు.

500 పడకల ఆస్పత్రి

మెడికల్ కాలేజీ కోసం 500 పడకల ఆస్పత్రి నిర్మించనున్నారు. మొత్తం 18 విభాగాలు ఏర్పాటు చేస్తారు. 120 జనరల్ మెడిసిన్ బెడ్లు, 120 జనరల్ సర్జరీ బెడ్లు, 60 పీడియాట్రిక్ (చిన్న పిల్లల) బెడ్లు, 60 ఆర్థోపెడిక్ బెడ్లు, 60 గైనకాలజీ, 10 ఆప్తమాలజీ, 10 డెర్మటాలజీ, 10 బెడ్‌లు తల, మెదడు, చెవి, ముక్కు బాధితుల కోసం, 6 ఐసీయూ, 26 ఎమర్జెన్సీ బెడ్లు ఏర్పాటు చేయనున్నారు. 8 ల్యాబ్‌లు, 4 లెక్చర్ థియేటర్లు, 250 మంది కూర్చునే ఎగ్జామినేషన్ హాల్‌లు, 8 టీచింగ్ గదులు నిర్మించనున్నారు. ఇక స్టూడెంట్ హాస్టళ్లతో పాటు నర్సింగ్ హాస్టల్, సెంట్రల్ కిచెన్ హాల్, సెంట్రల్ డ్రగ్ స్టోర్, డయాలసిస్ సెంటర్, మెటర్నటీ వార్డు తదితర భవనాలను కూడా నిర్మిస్తారు. ఒక్కో విభాగంలో 10 మంది డాక్టర్లు ఉంటారు. ఈ లెక్క ప్రకారం సుమారు 200 నుంచి 250 మంది వరకు సాధారణ వైద్యులతో పాటు స్పెషలిస్ట్ డాక్టర్లను నియమిస్తారు. జిల్లాలోని కిడ్నీ బాధితులకు కూడా డయాలసిస్‌తో పాటు మెరుగైన వైద్యసేవలు అందించేందుకు కిడ్నీ రీసెర్చ్ సెంటర్ ఏర్పాటు చేస్తున్నారు.

■ సూపర్ సేవలు ఇలా..

ప్రధానంగా పల్మనాలజిస్ట్ (ఊపిరితిత్తులు), సైక్రియాటిస్ట్, ఆర్థోపెడిక్, రేడియాలజిస్ట్, ఈఎన్‌టీ స్పెషలిస్ట్, డెంటల్ సర్జన్, ఆప్తమాలజిస్ట్, చిల్డ్రన్స్ స్పెషలిస్ట్, గైనకాలజిస్ట్, ఫిజియోథెరపిస్ట్‌లు, ఫోరెన్సిక్, కార్డియాలజిస్ట్ తదితర విభాగాల్లో వైద్యులను, ప్రొఫెసర్లను నియమిస్తారు. దీనితో పాటు ఈసీజీ, ఎక్సరే, ఐసీయూ, వెంటిలేటర్ లాంటి తదితర అత్యాధునిక సదుపాయాలు ఉన్న వైద్యశాలను ఏర్పాటు చేస్తారు. కేటాయించిన స్థలంలో సిబ్బంది క్వార్టర్స్, మెడికోలకు హాస్టల్ నిర్మాణం కూడా జరుగుతుంది.

సీఎంకు ప్రత్యేక ధన్యవాదాలు



వెనుకబడిన మార్కాపురంలో మెడికల్ కాలేజీ ఏర్పాటు చేసినందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ప్రత్యేక ధన్యవాదాలు. మెడికల్ కాలేజీ ఏర్పాటుతో అధునాతన వైద్యసేవలు, స్పెషలిస్టు వైద్యుల సేవలు అందుబాటులోకి వస్తాయి. సీఎం జగన్ ఇచ్చిన హామీని నెరవేర్చారు. మార్కాపురం ప్రాంత ప్రజలు ఆయనకు రుణపడి ఉంటారు. పనులు వేగంగా జరుగుతున్నాయి.

– ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి

పార్టీని బలోపేతం చేయడమే లక్ష్యం

- పార్టీ అభ్యర్థి గెలుపే లక్ష్యంగా ప్రతి ఒక్కరూ కృషి చేయాలి
- సామాజిక న్యాయంలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిదే అగ్రస్థానం
- బుర్రా మధుసూదన్ యాదవ్ అభ్యర్థిత్వంలో ఎలాంటి మార్పు లేదు
- అసమ్మతులు, గ్రూపులను ప్రోత్సహించే ప్రసక్తే లేదు
- వైఎస్సార్ సీపీ రీజినల్ కోఆర్డినేటర్లు బీదా మస్తాన్‌రావు, భూమన కరుణాకర్ రెడ్డి



బీదా మస్తాన్‌రావు, భూమన కరుణాకర్‌రెడ్డి, జంకె వెంకటరెడ్డి, సుకుమార్‌రెడ్డిలను సన్మానిస్తున్న ఎమ్మెల్యే బుర్రా మధుసూదన్ యాదవ్

కనిగిరి రూరల్: పార్టీని బలోపేతం చేయడమే లక్ష్యంగా ప్రతి కార్యకర్త పనిచేయాలని వైఎస్సార్ సీపీ రీజినల్ కోఆర్డినేటర్, రాజ్యసభ సభ్యుడు బీదా మస్తాన్‌రావు, పార్టీ రీజినల్ కోఆర్డినేటర్, తిరుపతి ఎమ్మెల్యే భూమన కరుణాకర్‌రెడ్డి అన్నారు. స్థానిక వైఎస్సార్ భవన్‌లో మంగళవారం నియోజకవర్గ విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే, టీటీడీ పాలక మండలి సభ్యుడు బుర్రా మధుసూదన్ యాదవ్ అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో బీదా మస్తాన్‌రావు మాట్లాడుతూ ఏరాష్ట్రంలో లేని విధంగా సంక్షేమ పథకాలు అమలు చేసి ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిదేనన్నారు. పార్టీలకతీతంగా కరోనా కష్టకాలంలో కూడా పథకాలు అమలు చేసి రాష్ట్ర ప్రజలను ఆదుకున్నారన్నారు. సంక్షేమ పథకాలతో పాటు సామాజిక న్యాయంలో కూడా సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి దే అగ్రస్థానం అని కొనియాడారు. రాష్ట్రంలో 77 శాతం నామినేటెడ్, రాజకీయ పదవుల్లో పేదవర్గాల వారికే ఉన్నత స్థానం కల్పించారన్నారు. రాజ్యసభలో 4 సీట్లు బీసీలకు ఇచ్చారని, 18 ఎమ్మెల్సీ స్థానాల్లో 14 స్థానాలు కేటాయించి ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు పెద్ద పీట వేశారన్నారు. మనమంతా వైఎస్సార్ కుటుంబ సభ్యులమని.. చిన్న చిన్న సమస్యలున్నా పరిష్కరించుకుని ముందుకు సాగుదామన్నారు. రాజకీయాలు చేయడానికో.. అసమ్మతిని ప్రోత్సహించడానికో తాము రాలేదని స్పష్టం చేశారు. క్షేత్ర స్థాయిలో ఉన్న చిన్న చిన్న అంశాలను తెలుసుకుని పరిష్కరించేందుకు కృషి చేస్తామన్నారు. కనిగిరిలో ఎమ్మెల్యేను తిరిగి గెలిపించుకుని, సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ముఖ్యమంత్రిని చేయడమే లక్ష్యమని వెల్లడించారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లి చైతన్యవంతులను చేయాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు.



వైఎస్సార్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న బీదా మస్తాన్‌రావు, భూమన, జంకె, బుర్రా

ఎమ్మెల్యే బుర్రా మధుసూదన్ యాదవ్ అభ్యర్థిత్వంలో ఎలాంటి మార్పు లేదు: భూమన కరుణాకర్ రెడ్డి

కనిగిరి ఎమ్మెల్యే బుర్రా మధుసూదన్ యాదవ్ అభ్యర్థిత్వం పై ఎటువంటి మార్పు లేదని పార్టీ రీజినల్ కోఆర్డినేటర్, తిరుపతి ఎమ్మెల్యే భూమన కరుణాకర్‌రెడ్డి స్పష్టం చేశారు. ఎమ్మెల్యే బుర్రా మధుసూదన్ యాదవ్‌కు మరింత బలం చేకూర్చేందుకే తాము వచ్చామన్నారు. ఒకటి రెండు నియోజకవర్గాల్లో అభ్యర్థుల మార్పుపై కూడా మన నాయకులు చర్చించారని, కానీ కనిగిరి ఎమ్మెల్యే బుర్రా మధుసూదన్ యాదవ్‌పై అటువంటి చర్చే జరగలేదని స్పష్టం చేశారు. పార్టీలో గ్రూపులను, అసమ్మతులను తాము ప్రోత్సహించేది లేదన్నారు. అభ్యర్థులను ప్రకటించే స్థాయి తమది కాదన్నారు. పార్టీ బలోపేతానికి, ఇతర క్షేత్ర స్థాయిలో సమస్యలు, అభ్యంతరాలు, సలహాలుంటే నేరుగా తమకు స్వేచ్ఛగా చెప్పాలని, అయితే అవి అంతిమంగా ఎమ్మెల్యేను గెలిపించేందుకు ఉపయోగపడాలని స్పష్టం చేశారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో మన పార్టీ అభ్యర్థుల గెలుపే లక్ష్యంగా అందరూ పనిచేయాలని పిలుపునిచ్చారు.

వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే జంకె వెంకటరెడ్డి మాట్లాడుతూ ఎమ్మెల్సీ ఎన్నికల్లో శ్యాంప్రసాద్‌రెడ్డి, చంద్ర శేఖర్‌రెడ్డిల విజయమే లక్ష్యంగా ప్రణాళికా బద్ధంగా పనిచేయాలన్నారు. నియోజకవర్గ పరిశీలకుడు మన్నెమాల సుకుమార్‌రెడ్డి మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న ప్రతి పథకాన్ని విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. లోకేష్ పాదయాత్ర అంతా డ్రామా కంపెనీ అని ఎద్దేవా చేశారు. నిరంతరం ప్రజలను వంచించే చంద్రబాబుతో పాటు, ఎల్లో మీడియా పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ ఎస్‌కే అబ్దుల్ గఫార్, వైస్ చైర్మన్లు పులిశాంతి గోవర్ధన్, మాణిక్యరావు, ఎంపీపీలు దంతులూరి ప్రకాశం, గంగసాని లక్ష్మి, గాయం సావిత్రి, అత్యాల జఘన్య, మూడమంచు వెంకటేశ్వర్లు, రామన మహాలక్ష్మమ్మ, జెడ్పీటీసీలు కస్తూరిరెడ్డి, చప్పిడి సుబ్బయ్య, మేకల శ్రీను, ఒకేరెడ్డి, రామన తిరుపతిరెడ్డి, మాజీ ఎంపీపీలు పోతుకొండారెడ్డి, గాయం బలరాంరెడ్డి, ఏపీ మెడికల్ కౌన్సిల్ మెంబర్ డాక్టర్ పెరుగు మురళీ కృష్ణ, రంగనాయకులరెడ్డి, హుస్సేన్‌రెడ్డి, సాల్మన్ తదితరులు పాల్గొన్నారు. తొలుత దివంగత ముఖ్యమంత్రి వైఎస్సార్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

మోపాడులో సమృద్ధిగా నీరు

- ప్రాజెక్ట్స్ సీఈ మురళీనాథరెడ్డి
- సాగునీరు నిలిపిన వెంటనే ఆధునికీకరణ పనులు



మోపాడు రిజర్వాయర్‌ను పరిశీలిస్తున్న ఇరిగేషన్ ప్రాజెక్ట్స్ సీఈ, ఎస్ఈ, డీఈ

పామూరు: మోపాడు రిజర్వాయర్‌లో 23 అడుగుల మేర నీరు ఉందని, సాగులో ఉన్న పంటలకు ఎటువంటి ఢోకా లేదని ఇరిగేషన్ ప్రాజెక్ట్స్ సీఈ మురళీనాథరెడ్డి తెలిపారు. సాధారణ తనిఖీల్లో భాగంగా మంగళవారం మండలంలోని మోపాడు రిజర్వాయర్ నీటి నిల్వలు, రిజర్వాయర్ అలుగు ప్రాంతాన్ని ఆయన క్షేత్రస్థాయిలో ఎస్ఈ లక్ష్మీరెడ్డి, డీఈ బి.రవిలతో కలిసి పరిశీలించారు. రిజర్వాయర్‌లో ప్రస్తుతం 23 అడుగుల్లో నీరు ఉందని మోపాడు ఆయకట్టు పరిధిలోని పామూరు మండలం, నెల్లూరు జిల్లా కొండాపురం మండలాల్లో సాగులో ఉన్న వరిపైరుకు ప్రస్తుతం నీటి విడుదలవుతున్నట్లు తెలిపారు. నీటి సరఫరాను ఎప్పటికప్పుడు అంచనావేస్తున్నట్లు చెప్పారు. రిజర్వాయర్ కట్ట, అలుగు బలోపేతానికి నిధుల కోసం ప్రతిపాదనలు పంపామని, త్వరలో కార్యరూపం దాల్చుతాయన్నారు. రిజర్వాయర్‌లో సాగుకు పోను మరో 21 అడుగులదాకా నీరు నిల్వ ఉండే అవకాశం ఉందని, వచ్చే సీజన్‌లో వరిసాగుకు నీటి విడుదలకు కృషి చేస్తామన్నారు. నీటి విడుదలను నిలిపివేసిన కాలంలో వేగంగా ఆధునికీకరణ పనులు పూర్తి చేస్తామన్నారు. వారి వెంట ఇరిగేషన్ ఏఈఈ శ్రీను, ఐసీ అసిస్టెంట్ షేక్. నాయబ్‌రసూల్ ఉన్నారు.

పాఠశాలల్లో 'పచ్చ' నేతల ప్రచారం

- నిబంధనలకు విరుద్ధంగా తరగతి గదిలోనే సమావేశం

యర్రగొండపాలెం: నిబంధనలకు విరుద్ధంగా టీడీపీ నాయకులు ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారాన్ని పాఠశాలల్లో ముమ్మరంగా చేస్తున్నారు. తరగతి గదిలో విద్యార్థులు కూర్చునే బెంచీలపై ఉపాధ్యాయులను కూర్చోబెట్టి తమ అభ్యర్థికి ఓటు వేయాలని వారు ప్రచారం చేస్తున్నారు. పెద్దారవీడు మండలంలోని దేవరాజుగట్టు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి గూడూరి ఎరిక్షన్‌బాబు ఉపాధ్యాయులను సమావేశపరచి ప్రసంగించారు. తన ప్రసంగంలో ప్రభుత్వానికి వ్యతిరేకంగా మాట్లాడుతూ టీడీపీ బలపరచిన తూర్పు రాయలసీమ పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థికి ఓటు వేయాలని ఆయన ప్రచారం చేశారు. తప్పని పరిస్థితుల్లో ఈ ప్రచార కార్యక్రమంలో పాల్గొనాల్సి వచ్చిందని ఆ పాఠశాల ఉపాధ్యాయులు పలువురు తెలిపారు. అభ్యర్థిని గెలిపించుకోవాలన్న ఉబలాటం ఆయా పార్టీలకు ఉంటుందని, తదనుగుణంగా ప్రచారం చేసుకోవచ్చని, పాఠశాల ఆవరణలో ముఖ్యంగా తరగతి గదిలో పిల్లలను కూర్చోబెట్టినట్లు తమను కూర్చోబెట్టి ప్రసంగాలు చేయడం సరైన పద్ధతి కాదని వారు తెలిపారు. రోజుకొక పార్టీ పాఠశాలల్లోకి వచ్చి ప్రచారం చేసుకుంటూ పోతే విద్యార్థులకు ఇబ్బందిగా ఉంటుందన్న విషయాన్ని నాయకులు గుర్తించాలని కోరారు. పాఠశాలలో వరండాల్లో ప్రచారం చేసుకోమని చెప్పానని, వారు తరగతి గదిలో సమావేశం పెట్టుకొని ప్రచారం చేసుకున్నారని ఆ పాఠశాల హెచ్ఎం సుబ్రహ్మణ్యం వివరించారు. తనకు అవగాహనలేక ఈ పొరపాటు జరిగిందని ఆయన చెప్పినా టీడీపీ నాయకులు ప్రచారం చేసుకోవటానికి పూర్తిస్థాయిలో సహకరించినట్లు అక్కడి ఏర్పాట్లను బట్టి తెలుస్తోంది.



దేవరాజుగట్టు జెడ్పీ హైస్కూల్‌లో ఉపాధ్యాయులతో మాట్లాడుతున్న టీడీపీ ఇన్‌చార్జి ఎరిక్షన్‌బాబు

ఆధునిక టెక్నాలజీతో ప్రమాదాలకు చెక్

- డీఆర్‌డీఏ పీడీ డాక్టర్ అర్జున్‌రావు

బల్లికురవ: గ్రానైట్ క్వారీల్లో భద్రతా చర్యలు పాటించటంతో పాటు ఆధునిక టెక్నాలజీని ఉపయోగిస్తే ప్రమాదాలకు చెక్ పెట్టవచ్చని బాపట్ల జిల్లా డీఆర్‌డీఏ పీడీ డాక్టర్ బీ.అర్జున్‌రావు వెల్లడించారు. మండలంలోని ఈర్లకొండ, కొణిదెన, బల్లికురవ రెవెన్యూలో 3.51 హెక్టార్లలో కక్కెర మల్లన్న, సరోజిని గ్రానైట్ క్వారీల ఏర్పాటుకు పర్యావరణ–ప్రజాభిప్రాయ సేకరణను మంగళవారం చేపట్టారు. ఈ సందర్భంగా పీడీ మాట్లాడుతూ గనుల్లో ప్రమాదాలు సంభవించకుండా యజమానులు, మేనేజర్లు ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉండాలన్నారు. ఎవరి హద్దులకు లోబడి వారి పనులు చేయిస్తూ ప్రతిరోజు క్వారీ పరిసరాలు రోడ్లపై దుమ్ము లేవకుండా నీళ్లు చల్లించాలన్నారు. పర్యావరణ పరిరక్షణకు క్వారీ చుట్టూ చెట్ల పెంపకాన్ని చేపట్టాలన్నారు. కార్మికులకు అందుబాటులో ప్రథమ చికిత్స కిట్‌లు, ఒకేషనల్ శిక్షణతో ఆరు నెలలకు ఒకసారి వైద్య పరీక్షలు చేయించాలన్నారు. క్వారీలకు సమీపంలోని గ్రామాల అభివృద్ధితో పాటు నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ పీ.సీ తారత్నం, పర్యావరణ పరిరక్షణ ఈఈ నాగిరెడ్డి, క్వారీ యజమాని కక్కెర సత్యనారాయణ పాల్గొన్నారు.



పర్యావరణ ప్రజాభిప్రాయ సేకరణలో మాట్లాడుతున్న డీఆర్డీఏ పీడీ

రొయ్య అధరహో



అమ్మకానికి సిద్ధం చేసిన రొయ్యలు

ప్రస్తుతం రొయ్యల ధరలు..	
30 కౌంట్	రూ.450
40 కౌంట్	రూ.390
50 కౌంట్	రూ.340
60 కౌంట్	రూ.320
70 కౌంట్	రూ.300
80 కౌంట్	రూ.280
90 కౌంట్	రూ.260
100 కౌంట్	రూ.250

- పెరుగుతున్న రొయ్యల ధరలు
- ఫలిస్తున్న రైతుల ప్రయత్నాలు
- ఆక్వా సాగుకు ప్రభుత్వం ప్రోత్సాహం

చీరాల: ఎట్టకేలకు రొయ్య నవ్వింది. రొయ్యల ధరలు అధరహో అంటున్నాయి. కొంత కాలంగా ధరలు లేక ఆక్వారైతులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. అయితే ప్రభుత్వం ఆక్వా రైతులకు దన్నుగా నిలబడి అండగా ఉండటంతో కొంత కాలం నష్టాల బారిన పడకుండా బయటపడ్డారు. దీంతో పాటు ఆక్వా రైతులకు విద్యుత్ రాయితీ కల్పిస్తూ యూనిట్‌కి రూ.1.50 తగ్గించింది. కోవిడ్ కారణంగా మూడేళ్ల నుంచి ధరలు లేక ఇబ్బందులు ఎదుర్కొన్నారు. కొంత మంది రైతులు సాగును వదిలేశారు. అయితే ప్రస్తుతం రొయ్యల ధరలు పెరగడంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం వంద కౌంట్ ధర రూ.250 పలుకుతోంది. అయితే కొందరు రైతులు ఈ ధరలు ఎప్పుడూ నిలకడగా ఉండటం లేదని అంటున్నారు. ప్రస్తుతం ఎక్కువగా సరుకు అందుబాటులో లేకపోవడం వల్లనే వ్యాపారులు ధరలు పెంచారని రైతులు చర్చించుకుంటున్నారు.

పంటమార్పిడి ప్రయత్నాలు ఫలిస్తున్నాయి..

ఆక్వా రైతులు గడిచిన పదేళ్ల నుంచి వెనామీ రొయ్యలు సాగు చేశారు. ఈ రకం రొయ్యలు ఎటువంటి తెగుళ్ల బారిన పడకుండా మంచి దిగుబడులు వస్తాయని నమ్మకం ఉండేది. అయితే గడిచిన ఐదేళ్లుగా వెనామీ రొయ్య సీడ్ నాణ్యత లేకపోవడంతోపాటు తరచూ వైరస్‌ల బారిన పడటంతో సాగులో రైతులు నష్టపోయారు. దీంతో కొంత మంది రైతులు ఏడాది కాలంగా పంట మార్పిడి పద్ధతి పాటిస్తున్నారు. ఈ పద్ధతిని పాటించిన రైతుల ప్రయత్నాలు సఫలీకృతమయ్యాయి. వేసవిలో టైగర్ రొయ్యల సాగు చేసి, సీతాకాలంలో వెనామీ పంట సాగు చేస్తూ పంట మార్పిడి విధానాన్ని అవలంబించి ఫలితాలు సాధిస్తున్నారు. బాపట్ల జిల్లాలోని చిన్నగంజాం, వేటపాలెం, కర్లపాలెం, రేపల్లె, నిజాంపట్నం, బాపట్ల ప్రాంతాల్లో దాదాపు 25 వేల ఎకరాల్లో రొయ్యలు సాగుచేస్తుంటారు. ప్రస్తుతం రెండొంతులు పంట పూర్తయింది. ప్రస్తుతం వేసవి పంట వేయడానికి కొందరు రైతులు చెరువులు సిద్ధం చేసుకుంటున్నారు. కొన్ని ప్రాంతాల్లో ఇప్పటికే చెరువుల్లో వేసవి సాగుకు సంబంధించి రొయ్య పిల్లలు వదిలారు.



సాగుకు సిద్ధం చేసిన రొయ్యల చెరువు

క్లుప్తంగా

మాజీ సైనికుడ్ని అభినందించిన కలెక్టర్



సీతారామయ్యను అభినందిస్తున్న కలెక్టర్ దినేష్‌కుమార్

ఒంగోలు అర్బన్: మాజీ సైనికుడు కె.సీతారామయ్యను కలెక్టర్ ఏఎస్ దినేష్‌కుమార్, జిల్లా సైనిక్ వెల్ఫేర్ అధికారి రజనీలు సోమవారం విడివిడిగా అభినందించారు. ఆక్వా డెవిల్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గత నెల 26వ తేదీ ఉండవల్లిలోని లైలా గంగరాజు నగర్‌లో నిర్వహించిన 23వ కృష్ణా రివర్ స్విమ్మింగ్ పోటీల్లో పాల్గొని 1.5 కిలోమీటర్ల దూరాన్ని 40.46 నిముషాల్లో స్విమ్ చేసి గెలుపొందారు. ఈ నేపథ్యంలో కలెక్టర్, సైనిక్ వెల్ఫేర్ అధికారి గెలుపొందిన మాజీ సైనికుడ్ని అభినందించారు.

తల్లి, ఇద్దరు బిడ్డల అదృశ్యం

కంభం: ఓ మహిళ తన ఇద్దరు పిల్లతో కలిసి సోమవారం ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాకపోవడంతో ఆమె భర్త ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ నాగమల్లేశ్వరరావు మంగళవారం తెలిపారు. వివరాలు.. మండలంలోని యర్రబాలెం గ్రామానికి చెందిన ఎగిలిశెట్టి శ్రీలక్ష్మి తన ఇద్దరు పిల్లలతో సోమవారం ఉదయం 8.30 గంటల సమయంలో ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. ఎక్కడ వెతికినా వారి ఆచూకీ కనిపించక పోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

అమ్మనబ్రోలు విద్యార్థికి రాష్ట్రస్థాయి బహుమతి

ఒంగోలు టౌన్: విజయవాడ లయోలా కాలేజీలో జరిగిన రాష్ట్ర స్థాయి వైజ్ఞానిక ప్రదర్శనలో అమ్మనబ్రోలు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థి ఎం.శశాంక్ ప్రదర్శించిన మెడిసిన్స్ ఇన్ ఎర్త్ న్యూట్రిన్స్‌కు ఎన్విరాన్‌మెంట్ అండ్ క్లైమెట్ ఛేంజ్ అనే థీంలో రాష్ట్రస్థాయిలో తృతీయ బహుమతి లభించింది. జాయింట్ కలెక్టర్ నుకర్ అజయ్, మేయర్ రాజ్యలక్ష్మి, ఎస్‌సీఈఆర్టీ డైరెక్టర్ బి.ప్రతాప్‌రెడ్డి చేతుల మీదుగా మంగళవారం బహుమతిని అందుకున్నాడు. క్విజ్ పోటీల్లో యర్రగొండపాలెంకు చెందిన విద్యార్థిని ఎస్‌కే ఆసిఫా, ముండ్లమూరు మోడల్ స్కూలు విద్యార్థి ఏ.జితేంద్ర, చీమకుర్తి అంబేడ్కర్ గురుకులం విద్యార్థిని బి.హరితలు రాష్ట్రస్థాయిలో తృతీయ స్థానం సాధించారు. అత్యుత్తమ ప్రతిభ కనబరిచి విద్యార్థులకు జిల్లా విద్యాశాఖాధికారి పి.రమేష్ అభినందించారు.

కేంద్రంపై విద్యార్థులు ఉద్యమించాలి

ఒంగోలు టౌన్: కేంద్ర ప్రభుత్వం ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి చేస్తున్న ద్రోహాన్ని ప్రతి విద్యార్థికి తెలియజేసి ఉద్యమాలకు సిద్ధం చేయాలని ఆర్ఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షులు రవిశంకర్ రెడ్డి పిలుపునిచ్చారు. మంగళవారం రాష్ట్ర మహాసభ ముగింపు సభలో ఆయన ప్రసంగించారు. 2014 విభజన చట్టంలో ఉన్న హామీల సాధనకు రాష్ట్ర వ్యాప్త ఉద్యమాలకు సిద్ధం కావాలని కోరారు. శిథిలావస్థలో ఉన్న సంక్షేమ వసతి గృహాల భవనాల నిర్మాణాలకు నిధులు మంజూరు చేయాలని, సకాలంలో మెస్ చార్జీలు చెల్లించాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర వ్యాపంగా ఖాళీగా ఉన్న పోస్టులను సత్వరమే భర్తీ చేయాలన్నారు. రాష్ట్ర కమిటీ అధ్యక్షుడిగా వేణుతుర్ల రవిశంకర్ రెడ్డి, కార్యదర్శిగా శ్రీధర్, ఉపాధ్యక్షులుగా ప్రశాంత్, చరణ్, నాగరాజు, చందు, భీమేష్, సాయిని ఎన్నుకున్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికలకు

పక్కా ఏర్పాట్లు చేయండి



సమీక్షలో మాట్లాడుతున్న రిటర్నింగ్ అధికారి హరినారాయణన్, జాయింట్ కలెక్టర్ వెంకటేశ్వర్



ఎమ్మెల్సీ ఎన్నికలపై రిటర్నింగ్ అధికారి ఎం.హరినారాయణ నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న సబ్‌కలెక్టర్ సేతుమాధవన్, డీఆర్‌ఓ ఓబులేసు

- రిటర్నింగ్ అధికారి హరినారాయణన్
- ఉమ్మడి నెల్లూరు, ప్రకాశం–చిత్తూరు జిల్లాల ఎన్నికల ఏఆర్‌ఓలైన డీఆర్వో, ఆర్డీవోలతో సమీక్ష

సాక్షి, చిత్తూరు: ఎమ్మెల్సీ ఎన్నికల నిర్వహణకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని కలెక్టర్, నెల్లూరు, ప్రకాశం, చిత్తూరు పట్టభద్రుల, ఉపాధ్యాయుల నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి ఎం.హరినారాయణన్ అన్నారు. మంగళవారం రిటర్నింగ్ అధికారి ఉమ్మడి నెల్లూరు, ప్రకాశం, చిత్తూరు జిల్లాల్లోని ఎన్నికల ఏఆర్వోలైన డీఆర్వో, ఆర్డీవోలతో ఎన్నికల నిర్వహణకు సంబంధించి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జిల్లా జాయింట్ కలెక్టర్ ఎస్.వెంకటేశ్వర్‌తో కలసి సమీక్షించారు.

ఈ సందర్భంగా రిటర్నింగ్ అధికారి మాట్లాడుతూ మార్చి 13న ఎన్నికల నిర్వహణకు నిర్దిష్ట ప్రణాళికతో ఎన్నికల సంఘం ఆదేశాలను అనుసరించి ఎటువంటి తప్పులకు తావు లేకుండా పకడ్బందీగా చర్యలు చేపట్టాలన్నారు. అవసరమైన సెక్టోరల్ అధికారులు, ప్రిసైడింగ్ అధికారులు, ఇతర ఎన్నికల సిబ్బంది, కౌంటింగ్ సిబ్బందికి శిక్షణ కార్యక్రమాలు పూర్తి చేయాలన్నారు. పోలింగ్ స్టేషన్‌లలో అవసరమైన సదుపాయాలు కల్పించాలని, ఆర్డీవోలు ప్రతి పోలింగ్ స్టేషన్‌ను పరిశీలించాలని ఆదేశించారు. పోలింగ్ కేంద్రాలకు కేటాయించిన నంబర్‌ను పెయింట్ చేయించాలని, విద్యుత్ సౌకర్యం ప్రతి పోలింగ్ కేంద్రంలోనూ ఉండేలా చర్యలు చేపట్టాలన్నారు. మార్చి 9వ తేదీ నాటికి పోలింగ్ నిర్వహణకు అవసరమైన సామగ్రిని సిద్ధం చేయాలన్నారు. బ్యాలెట్ బాక్స్‌ల నాణ్యతను కచ్చితంగా ఆర్డీవోలు పరిశీలించాలన్నారు. స్ట్రాంగ్ రూముల వద్ద పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేయాలన్నారు. రిసెప్షన్, డిస్ట్రిబ్యూషన్ సెంటర్లు, కౌంటింగ్ సెంటర్ల వద్ద ప్రతి అంశాన్ని పరిశీలించాలన్నారు. ఓటర్ స్లిప్‌లను బీఎల్వోల సహాయంతో ఓటర్లకు అందజేయాలని సూచించారు.

పోస్టల్ బ్యాలెట్ ఫెసిలిటేషన్ సెంటర్, హెల్ప్ డెస్క్ ఏర్పాటు చేయాలన్నారు. ఆర్డీవోలు పోలింగ్ నిర్వహణకు సంబంధించి డీఎస్పీ, తహశీల్దార్‌లతో సమన్వయ సమావేశం నిర్వహించాలని ఆదేశించారు. పోలింగ్ నిర్వహణ రోజున పోలింగ్ కేంద్రాల వద్ద ఓటు హక్కు వినియోగానికి సంబంధించి అవగాహన కల్పించేలా అవసరమైన పోస్టర్లు ఏర్పాటు చేయాలన్నారు. ఈ అంశంపై రాజకీయ పార్టీల ప్రతినిధులకు, ఓటర్లకు అవగాహన కల్పించేలా విస్తృత ప్రచారం చేపట్టాలన్నారు. వీడియో కాన్ఫరెన్స్‌కు చిత్తూరు సచివాలయం నుంచి చిత్తూరు డీఆర్వో ఎన్.రాజశేఖర్‌తోపాటు తిరుపతి, నెల్లూరు, ప్రకాశం, బాపట్ల, అన్నమయ్య జిల్లాల్లో ఆయా ప్రాంతాల నుంచి డీఆర్వోలు, ఆర్డీవోలు పాల్గొన్నారు.

కట్టుకున్నోడే కాలయముడు

- భార్యపై అనుమానంతో హత్య చేసిన భర్త
- ప్రమాదంలో చనిపోయిందని చిత్రీకరణ
- సీఐ దర్యాప్తుతో అసలు నిజాలు వెలుగులోకి



మృతిచెందిన కోటేశ్వరి

బేస్తవారిపేట: అనుమానంతో భార్యను హత్య చేసిన సంఘటన సోమవారం అర్ధరాత్రి వెలుగులోకి వచ్చింది. బేస్తవారిపేట మండలంలోని పందిళ్లపల్లె ఎస్సీ కాలనీకి చెందిన తోటకూరి బసవరాజుతో బేస్తవారిపేట మండలం చెట్టిచర్లకు చెందిన కోటేశ్వరీతో 13 ఏళ్ల క్రితం వివాహమైంది. చెడు వ్యసనాలకు లోనైన బసవరాజు భార్యపై అనుమానం పెంచుకుని శారీరకంగా, మానసికంగా వేధించేవాడు. ఈ క్రమంలో కోటేశ్వరి అప్పుడప్పుడు తల్లివద్దకు వచ్చి ఉండటం, భర్త వచ్చి బాగా చూసుకుంటానని చెప్పి తీసుకెళ్లడం జరుగుతుండేది. ఈ నేపథ్యంలో గత రెండు నెలలుగా కోటేశ్వరి పిల్లలతో పుట్టింట్లోనే ఉంటుంది. 26వ తేదీ బసవరాజు చెట్టిచర్లలోని అత్తగారింటికి వెళ్లి రాత్రికి అక్కడే ఉండి ఇకపై బాగా చూసుకుంటానని నమ్మబలికాడు. 27వ తేదీన పందిళ్లపల్లె వెళ్తున్నామని భార్యను మోటార్‌సైకిల్‌పై ఎక్కించుకుని తీసుకెళ్లాడు. భార్యను పందిళ్లపల్లె ఎస్సీకాలనీకి తీసుకెళ్లకుండా కడప జిల్లా పోరుమామిళ్లపల్లె మండలం అక్కలరెడ్డిపల్లెలోని బంధువుల ఇంటికి తీసుకెళ్లాడు. అక్కడ దూర ప్రాంతంలో బసవరాజు భార్యను అక్రమ సంబంధంపై ప్రశ్నించాడు. ఆవేశంలో కర్రతో తలపై, ముఖంపై కొట్టడంతో తల పగిలి తీవ్రంగా గాయపడిన కోటేశ్వరి మృతి చెందింది.

రోడ్డు ప్రమాదంగా చిత్రీకరణ..

కోటేశ్వరిని హత్య చేసిన తరువాత అత్త అచ్చమ్మకు ఫోన్ చేసిన బసవరాజు..మా బంధువుల ఇంటికి అక్కలరెడ్డిపల్లెకు వెళ్తుండగా మోటార్‌సైకిల్‌పై నుంచి జారిపడి నీ కూతురు గాయాలపాలైందంటూ ఫోన్‌లో తెలిపాడు. ఆటోలో స్వగ్రామం పందిళ్లపల్లెకు కోటేశ్వరి మృతదేహాన్ని తీసుకువచ్చాడు. అచ్చమ్మ, కుటుంబసభ్యులు, బంధువులు పందిళ్లపల్లెకు వెళ్లి చూడగా తలపై, మెడపై, కాళ్లపై గాయాలు కనిపించాయి. దీంతో పథకం ప్రకారమే హత్య చేసి మోటార్‌సైకిల్‌పై జారిపడిందని నమ్మించే కుట్ర పన్నాడంటూ మృతురాలి తల్లి అచ్చమ్మ పోలీసులకు ఫిర్యాదు చేసింది. మృతురాలికి అబ్బాయి, ఇద్దరు అమ్మాయిలు ఉన్నారు. కంభం సీఐ రాజేష్ కుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

కలెక్టర్ ఆదేశాలు బేఖాతర్

- వార్డెన్‌ను సస్పెండ్ చేసిన ఇన్‌చార్జి కలెక్టర్ అభిషిక్త్ కిషోర్
- నేటికి విధుల్లో కొనసాగుతున్న వార్డెన్

సింగరాయకొండ: హాస్టల్ విద్యార్థులకు సరైన వసతులు, భోజన వసతి కల్పించకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించిన వార్డెన్ ఎస్‌పీ జగదీశ్వరిని గత నెల 24న సస్పెండ్ చేస్తూ ఇన్‌చార్జి కలెక్టర్ అభిషిక్త్ కిషోర్ ఆదేశాలు జారీ చేశారు. సస్పెన్షన్ కాపీని అదేరోజు సాయంత్రం 6.30 గంటల సమయంలో కొండపి సాంఘిక సంక్షేమ అధికారి యు దానయ్య మూలగుంటపాడు గ్రామ సచివాలయ వెల్ఫేర్ అధికారి హరీష్, మహిళా పోలీసు ప్రవల్లికను వెంటబెట్టుకుని వసతిగృహంలో ఉన్న వార్డెన్ జగదీశ్వరికి సస్పెన్షన్ కాపీని అందించే ప్రయత్నం చేయగా ఆమె ఆర్డర్ కాపీని తీసుకునేందుకు నిరాకరించారు. దీంతో అధికారి దానయ్య ఆర్డర్ కాపీని వసతిగృహంలోని విద్యార్థినుల సమక్షంలో గోడకు అతికించారు. తరువాత జరిగిన విషయాన్ని ఎంపీడీఓ షేక్ జమీఉల్లా, తహసీల్దార్ సీహెచ్ ఉషకు సమాచారం అందించారు. కానీ నేటికి వార్డెన్ జగదీశ్వరి విధుల్లో కొనసాగుతూనే ఉంది. వార్డెన్ సస్పెన్షన్‌తో పాటు వసతిగృహంలోని విద్యార్థినులను తాత్కాలికంగా మండల కాంప్లెక్స్ వద్ద ఉన్న బీసీ కాలేజీ బాలికల వసతి గృహంలోకి మార్చాలని కూడా ఆదేశాలు జారీ చేసినా విద్యార్థినులు నేటికి పాత వసతి గృహంలోనే కొనసాగుతున్నారు. కలెక్టర్ ఆదేశాలు అమలు చేయకుండా వార్డెన్ విధుల్లో కొనసాగడం, విద్యార్థినులు వసతిగృహంలోనే ఉండటం ప్రభుత్వ వర్గాల్లో చర్చనీయాంశమైంది.

పోలీసుల అదుపులో గంజాయి స్మగ్లర్లు

టంగుటూరు: గంజాయి అక్రమ రవాణాపై అందిన సమాచారం మేరకు ఎస్పీ ఆదేశాల మేరకు సింగరాయకొండ సీఐ దాచేపల్లి రంగనాథ్, ఎస్సై ఖాదర్‌బాషా సిబ్బందితో స్థానిక టోల్‌ప్లాజా వద్ద మంగళవారం సోదాలు చేశారు. సోదాల్లో చెన్నై వైపు ఆటోలో గంజాయి తరలిస్తున్నట్లు గుర్తించారు. సుమారు 100 నుంచి 150 కేజీల వరకు గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు సమాచారం. గంజాయి తరలిస్తున్న ఆటో, స్మగ్లర్లను అదుపులోనికి తీసుకొని విచారిస్తున్నట్లు తెలిసింది. అయితే పోలీసులు ఈ విషయాన్ని గోప్యంగా ఉంచి విచారిస్తున్నారన్నారు. గంజాయిని ఎక్కడ నుంచి ఎక్కడికి తరలిస్తున్నారు, ఎంత మొత్తంలో తరలిస్తున్నారు, ఎన్ని వాహనాల్లో తరలిస్తున్నారో లోతుగా విచారణ చేస్తున్నట్లు తెలిసింది.

చోరీ కేసులో కారు డ్రైవర్ అరెస్టు

- రూ. 2.32 లక్షల సొత్తు స్వాధీనం

గుడ్లూరు: కారులో ఉంచిన నగదుతో ఉడాయించిన కారు డ్రైవర్ అన్సర్‌ను అరెస్టు చేసినట్లు ఎస్సై ప్రసాద్‌రెడ్డి తెలిపారు. ఉలవపాడు మండలంలోని రామాయపట్నం గ్రామానికి చెందిన అహద్ అన్సర్ అనే యువకుడు భార్య, పిల్లలతో కావలిలోని కచేరిమిట్టలో నివాసముంటూ కారు డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. నెల్లూరుకు చెందిన గౌస్ బాషా అనే వ్యక్తికి చెందిన కారును కావలికి తీసుకువచ్చి బాడుగలకు తిప్పుతున్నాడు. ఇతనికి చెడు అలవాట్లు ఉన్నాయి. అన్సర్ కారును కావలి మండలం తుమ్మలపెంట గ్రామానికి చెందిన వాయల శ్రీను సొంత పనుల కోసం బాడుగకు తీసుకువెళుతుంటాడు. ఈ క్రమంలో ఈ నెల 23వ తేదీ శ్రీను కారును ఇంటికి పిలుపించుకొని రూ.2.5 లక్షల నగదును కారు డాష్ బోర్డులో పెట్టి కావలికి వచ్చి అక్కడ నివాసం ఉంటున్న గుడ్లూరు మండలం చినలాటరఫి గ్రామానికి చెందిన గోపాల్‌రెడ్డిని ఎక్కించుకొని మండలంలోని నరసాపురం వద్ద గోపాల్‌రెడ్డికి చెందిన మామిడి తోట వద్దకు వెళ్లారు. శ్రీను, గోపాల్‌రెడ్డిలు మామిడి తోటలోకి వెళ్లగా డ్రైవర్ అన్సర్ డ్యాష్ బోర్డులో ఉన్న రూ.2.5 లక్షల నగదు తీసుకొని పక్కనే ఉన్న చెరువు దగ్గర చెట్లలో దాచి పెట్టాడు. మరలా కారు దగ్గరకు వచ్చి దొంగతనం చేసినట్లు అనుమానం రాకుండా ఉండటానికి పేపర్లను కారులో వేసి తగలబెట్టి నగదును తీసుకొని అక్కడ నుంచి పారిపోయాడు. కారులో నుంచి పొగలు వస్తుండటంతో గమనించిన శ్రీను కారు వద్దకు వచ్చి మంటలు ఆపి డ్యాష్ బోర్డులో చూడగా నగదు కనిపించలేదు. డ్రైవర్ కూడా కనిపించకపోయే సరికి నదగుతో పరారైనట్లు గుర్తించి డ్రైవర్ కోసం గాలించగా ఆచూకీ లభించక పోవడంతో పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. సోమవారం రాత్రి అన్సర్ దొంగిలించిన నగదు సంచితో రామాయపట్నం రావడానికి జాతీయ రహదారి వద్ద అడవిలక్ష్మీపురం క్రాస్ రోడ్డు వద్ద ఉండటంతో సమాచారం అందుకున్న ఎస్సై ప్రసాద్‌రెడ్డి అక్కడికి చేరుకొని అన్సర్‌ను అదుపులోకి తీసుకొని అతని వద్ద నుంచి రూ. 2.32 లక్షలు స్వాధీనం చేసుకొని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. అన్సర్‌పై కేసు నమోదు చేసి కందుకూరు కోర్టులో హాజరుపరచగా న్యాయమూర్తి రిమాండ్ విధించడంతో ఒంగోలు జైలుకు తరలించినట్లు ఎస్సై పేర్కొన్నారు.

జగనన్న చేదోడుతో సుస్థిర జీవనోపాధి



టైలర్స్‌ను సన్మానిస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ

చీమకుర్తి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అందిస్తున్న జగనన్న చేదోడు ద్వారా లక్షలాది మంది టైలర్లలో సుస్థిర జీవనోపాధి పొందుతున్నారని జిల్లాపరిషత్ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ ధీమా వ్యక్తం చేశారు. టైలర్స్ డే సందర్భంగా చీమకుర్తి టైలర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన కార్యక్రమానికి వెంకాయమ్మ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా జెడ్పీ చైర్‌పర్సన్ మాట్లాడుతూ గత జనవరి 30న రాష్ట్ర వ్యాప్తంగా 1.68 లక్షల మంది టైలర్స్‌కు జగనన్న చేదోడు మూడో విడతలో ఒక్కొక్కరికి రూ.10 చొప్పున మొత్తం రూ.168 కోట్లను అందించారని గుర్తు చేశారు. టైలర్స్ వృత్తిలో జీవనోపాధి చేసుకునే వారికి ఆర్థికంగా నిలదొక్కుకునేందుకు దోహదపడుతుందని విశ్వాసం వ్యక్తం చేశారు. చీమకుర్తి మండలంలోని టైలర్స్ అసోసియేషన్ కార్యాలయ నిర్మాణానికి అవసరమైన స్థలాన్ని అందించేందుకు, వారి సమస్యలు పరిష్కరించేందుకు సహకారం అందిస్తానని భరోసా ఇచ్చారు. తొలుత టైలర్స్ డే పితామహుడు విలియమ్స్ హో చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. టైలర్స్ అసోసియేషన్ సభ్యులు, నాయకులు, డాక్టర్ బి.జవహర్ పాల్గొన్నారు.

ఉరేసుకొని వివాహిత ఆత్మహత్య



మృతిచెందిన శృతి

యద్దనపూడి: అత్తింటివారితో ఏర్పడిన మనస్పర్థల కారణంగా వివాహమైన ఏడు నెలలకే ఓ మహిళ ఉరేసుకొని దుర్మరణం చెందింది. ఈఘటన మండలంలోని పూనూరు గ్రామంలోని ఎస్సీ కాలనీలో సోమవారం రాత్రి జరిగింది. పోలీసులు, బాధిత కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల మేరకు.. పూనూరు గ్రామానికి చెందిన యన్నం వసంతరావు కుమార్తె శృతి (19)ని గుంటూరు జిల్లా కాకుమాను గ్రామానికి చెందిన దొప్పలపూడి ఆనందబాబుతో గతేడాది ఆగస్టులో పెద్దలు చేశారు. పెళ్లైన 20 రోజులకే తన భర్తకు వేరే మహిళతో వివాహేతర సంబంధం ఉందని తెలిసి భార్యభర్తల మధ్య తరచూ ఘర్షణ జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో ఆరునెలల క్రితం శృతి పురుగుమందు తాగి ఆత్మహత్యయత్నానికి పాల్పడటంతో తల్లిదండ్రులు పుట్టింటికి తీసుకువచ్చారు. నాలుగురోజుల క్రితం శృతిని తల్లిదండ్రులు అత్తారింటికి కాపురానికి తీసుకువెళ్లగా భర్త ఆనంద్‌బాబు, అత్తమామలు కాపురానికి వద్దని నిరాకరించటంతో తిరిగి స్వగ్రామానికి తీసుకువచ్చారు. ఈ క్రమంలో మానసిక సంఘర్షణకు లోనైన శృతి సోమవారం రాత్రి ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యాన్‌కు ఉరేసుకుంది. గమనించిన కుటుంబసభ్యులు హుటాహుటిన మార్టూరు ప్రభుత్వాసుపత్రికి తరలించగా శృతి అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతురాలి తండ్రి వసంతరావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు శృతి భర్త, అత్తమామలను అదుపులోకి తీసుకొని విచారిస్తున్నట్లు ఎస్సై రత్నకుమారి తెలిపారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అందజేశారు.

ఓటు వేసే విధానంపై అవగాహన కల్పించాలి

- కలెక్టర్ దినేష్‌కుమార్



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ దినేష్‌కుమార్, పక్కన జేసీ అభిషిక్త్ కిషోర్, ఏఎస్పీ నాగేశ్వరరావు

ఒంగోలు అర్బన్: ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు హక్కు వినియోగించుకునే ఓటర్ల ఓట్లు చెల్లుబాటు అయ్యేలా ఓటు వేసే విధానాన్ని ఓటర్లకు క్షుణ్ణంగా అవగాహన కల్పించాలని కలెక్టర్ ఏఎస్ దినేష్‌కుమార్ అన్నారు. ఆ దిశగా రాజకీయ పార్టీలు, ఉద్యోగ సంఘాలు వారి వంతు పాత్ర పోషించాలన్నారు. ప్రకాశం భవనంలో అధికారులతో పాటు రాజకీయ పార్టీలు, ఉద్యోగ సంఘాల ప్రతినిధులతో ఓటు హక్కు వినియోగంపై మంగళవారం ప్రత్యేక సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ పోలింగ్ కేంద్రాల్లో ఓటర్లకు ఇబ్బందులు కలగకుండా వసతులు కల్పించడంతో పాటు ఓటును సమర్ధవంతంగా వినియోగించుకునేలా అధికార యంత్రాంగం చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఇన్ వ్యాలిడ్ ఓట్లు లేకుండా ప్రతి ఓటు కౌంటింగ్‌కు అర్హత పొందేలా ఓటరును చైతన్య పరచడంలో అందరం కలిసికట్టుగా పనిచేయాలన్నారు. ఓటు ఏ విధంగా వేయాలి, బ్యాలెట్‌ను ఎలా మడతపెట్టాలి, పొరపాటు జరగకుండా ఏం చేయాలి అనే అంశాలతో కూడిన పత్రాలను పోలింగ్ కేంద్రాల వద్ద గోడకు అతికిస్తామన్నారు. పోలింగ్ కేంద్రం చిరునామాతో కూడిన ఓటరు స్లిప్పులను ప్రతి ఓటరుకు పంపిణీ చేస్తామన్నారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ అభిషిక్త్ కిషోర్, ఏఎస్పీ నాగేశ్వరరావు, డీఆర్‌ఓ ఓబులేసు, మార్కాపురం సబ్‌కలెక్టర్ సేతు మాధవన్, ఒంగోలు ఆర్‌డీఓ విశ్వేశ్వరరావు ఇతర అధికారులు పాల్గొన్నారు.



పాల్గొన్న అధికారులు

విద్యుత్ షాక్‌తో బాలుడికి గాయాలు

- ఎమ్మెల్యే కేపీ కారులో వైద్యశాలకు తరలింపు



వైద్యశాలలో చికిత్స పొందుతున్న సుధీర్

మార్కాపురం టౌన్: ఆడుకుంటుండగా ట్రాన్స్‌ఫార్మర్ సమీపంలో పడిన బంతిని తీసుకునే క్రమంలో పదేళ్ల బాలుడికి విద్యుత్ తీగ తగిలి విద్యుదాఘాతానికి గురై తీవ్రంగా గాయపడ్డాడు. ఈ సంఘటన మంగళవారం సాయంత్రం పట్టణంలోని మున్సిపల్ పార్క్ వద్ద జరిగింది. పోషం శ్రీనివాసులు కుమారుడు సుధీర్ ఆడుకుంటుండగా బంతి వెళ్లి విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ వద్ద పడింది. దీంతో బంతి తీసుకునే క్రమంలో ఎర్తు తగలడంతో సుధీర్ గట్టిగా కేకలు వేశాడు. అటుగా వెళ్తున్న వ్యక్తి కట్టెతో వైర్లను కొట్టి విద్యుత్ సరఫరా ఆపాడు. ఈ సంఘటన జరుగుతున్న సమయంలో ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి ఇంటి బయటకు వచ్చి బాలుడి పరిస్థితి చూసి వెంటనే తన కారులో జిల్లా వైద్యశాలకు తరలించి అక్కడికి వెళ్లి వైద్యులతో మాట్లాడి మెరుగైన చికిత్స చేయించాలని డాక్టర్లను కోరారు. వైద్యులు సుధీర్‌కు మెరుగైన చికిత్స అందిస్తున్నారు. సకాలంలో ఎమ్మెల్యే తన వాహనంలో బాలుడిని తీసుకురావడంతో వైద్యులు వెంటనే చికిత్స అందించారు. సంఘటన స్థలాన్ని సీఐ భీమానాయక్, ఎస్ఐ శశికుమార్ సందర్శించారు.



వైద్యశాల వద్ద స్థానికులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి